క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : మల్టీపర్పస్ హెల్త్ ఎడ్యుకేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు శనివారం ఆవిష్కరించారు. రేసవానిపాలెంలోని కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీహెచ్‌ఈవో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నాగా అప్పారావు, జిల్లా అధ్యక్షుడు టీవీవీ సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.బాబి, ఎంహెచ్‌పీఈవో నాయకులు నాగభూషణం, శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీకి అభినందనలు



ఏయూ వీసీ ప్రసాదరెడ్డిని అభినందిస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్

ఏయూ క్యాంపస్ : ఆంధ్రా యూనివర్సిటీ ఉపకులపతిగా మరొకసారి బాధ్యతలు చేపట్టిన ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ అభినందించారు. శనివారం ఏయూలోని వీసీ చాంబర్‌లో ఆచార్య ప్రసాదరెడ్డిని కలిసి శ్రీ వత్సవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగ్గుపల్లి అప్పలరాజు, వైజాగ్ బ్రాహ్మిణ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కావూరి చరణ్ కుమార్, కాళ్ల సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో వేమన జయంతి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ సిస్టర్ షైజీ

కంచర పాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం వేమన ఫౌండేషన్ నేతృత్వంలో ప్రజాకవి వేమన జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విద్యార్థులకు కవితల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ కిలారి గౌరీ నాయుడు, దీప్తి, కోటేశ్వరరావు, సిస్టర్ జైన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు శ్రీవత్సవ్ తదితరులు

జగదాంబ : స్వామి వివేకానంద జయంతి ముగింపు ఉత్సవాలు జీవీఎంసీ 39వ వార్డులో వివేకానంద సంస్థ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన ఈ ఉత్సవాలలో భాగంగా శనివారం సంస్థలో మూడు వేల మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ డాక్టర్ జహీర్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ కలిసి కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల తాతాజీ, డాక్టర్ రమణమూర్తి, సంఘ సేవకులు శరణ్‌కుమార్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాహనమిత్ర.. ఆత్మీయ స్పర్శ



ఎలాంటి తారతమ్యాలు లేవు.. ఎక్కువ తక్కువల వ్యత్యాసాలు అసలే లేవు. ఉన్నదల్లా సాయం చేయాలన్న ఆర్తి నిండిన మనసే. పేదలు కూడా బాగుపడాలని.. సమాజంలో సుఖంగా, గౌరవప్రదంగా వాళ్లు కూడా జీవించాలనే ఒకే ఒక్క ధ్యేయంతో నిరంతరం తపించే సీఎం జగన్ అనేక పథకాలు ప్రవేశపెట్టి అందర్నీ ఆదుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వాహనమిత్ర పథకాన్ని ప్రవేశపెట్టి నియోజకవర్గంలోని ట్యాక్సీ, ఆటో డ్రైవర్లకు రూ. 10 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని ఈ సాయానికి ట్యాక్సీ, ఆటో డ్రైవర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మా బాగు కోరే జగన్‌బాబు వెంటే మేమంతా అంటున్నారు.

సంవత్సరాల వారీగా వైఎస్సార్ వాహన మిత్ర వివరాలు

- 2019-20లో 883 మంది లబ్ధిదారులకు రూ. 8830000
- 2020-21లో 883 మంది లబ్ధిదారులకు రూ. 8830000
- 2021-22లో 1596 మంది లబ్ధిదారులకు రూ. 15960000
- 2022-23 సంవత్సరానికి 1596 మంది లబ్ధిదారులకు రూ. 15960000
- 2023-24 సంవత్సరానికి 2734 మంది లబ్ధిదారులకు రూ. 27340000

మొత్తం నాలుగు సంవత్సరాలకు గాను అందించిన మొత్తం రూ. 76920000

- నియోజకవర్గంలో 4958 మందికి లబ్ధి
- అయిదు విడతల్లో రూ. 76920000 పంపిణీ
- ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల హర్షం



వాహనమిత్ర పథకం పొందుతున్న ఆటోవాలాలు

జగదాంబ : సంక్షేమం.. అభివృద్ధి వైఎస్సార్‌సీపీ లక్ష్యం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమల్లోకి తీసుకొచ్చి కుల, చేతి వృత్తిదారులకు చేదోడయ్యారు. వారి జీవన ప్రమాణాలు మెరుగయ్యేందుకు దోహదపడ్డారు. ఈ నేపథ్యంలో వాహన మిత్ర పథకాన్ని ప్రవేశపెట్టి ఎందరో ట్యాక్సీ, ఆటోడ్రైవర్లకు నేనున్నాను అని భరోసా కల్పించారు. ప్రతి సంవత్సరం లబ్ధిదారుల ఖాతాలో రూ. 10 వేలు జమ చేస్తూ కుడి భుజమై నిలబడ్డారు. దీనిపై ట్యాక్సీ, ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని పథకాలతో పేదలకు సేవ చేయటమే ధ్యేయంగా సీఎం జగన్ పని చేస్తున్నారని కొనియాడారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక..

గత ప్రభుత్వ హయాంలో అరకొర పథకాలు కొనసాగేవి. లబ్ధిదారుల ఎంపిక విషయంలో జన్మభూమి కమిటీలు చెప్పిందే వేదంగా ఉండేది. వారు చెప్పిన వారినే ఎంపిక చేసేవారు. నిజమైన లబ్ధిదారులకు పథకాలు సరిగ్గా అందేవి కాదు. ఈ నేపథ్యంలో జగనన్న పదవి చేపట్టారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైతే చాలు ఏ పథకమైనా ఎదురెళ్లి అందజేస్తున్నారు. నియోజకవర్గంలో ఉన్న 64 సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ వాహనమిత్ర పథకం అందుతోంది.

డ్రైవర్లకు చేయూత గొప్ప విషయం



అన్ని వర్గాల వారికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ.. మా డ్రైవర్లకు కూడా చేయూతనివ్వటం సంతోషకరం. గతంలో ఏ ప్రభుత్వంలోనూ మాకు ఇలాంటి సాయం అందలేదు. నేడు సీఎం జగన్ ఎలాంటి అవినీతి, లంచాలకు తావు లేకుండా సంక్షేమ పథకాలు అందజేయడం గొప్ప విషయం.

–వెంకట్రావ్, ఆటో డ్రైవర్, పూర్ణామార్కెట్

సీఎంకు రుణపడి ఉన్నాం..



ఎన్నో సంవత్సరాలుగా నేను ఆటో నడుపుతున్నాను. ఏనాడూ ఏ ప్రభుత్వమూ మాకు సాయం చేసిందే లేదు. అలాంటిది ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాకు అండగా నిలిచారు. వాహనమిత్ర పథకం మాకెంతో ఉపయోగపడుతోంది. పేదల పక్షాన నిలబడ్డ ముఖ్యమంత్రికి అందరం రుణపడి ఉన్నాం

– మూర్తి, ఆటో డ్రైవర్, కల్లుపాకలు

గతంలో ఏ ప్రభుత్వాలైనా చేశాయా?



సంక్షేమం అంటే ఇలా ఉంటుందని చూపించిన నాయకుడు జగనన్న. గతంలో ఏ ప్రభుత్వమైనా ఇలా చేసిందా? మాలాంటి డ్రైవర్లకు బతుకు చూపించారాయన. కుటుంబానికి పెద్ద దిక్కుగా.. మాలాంటి వారికి పెద్దన్నగా సీఎం జగన్‌ను భావిస్తున్నాం. మా కష్టం తెలిసిన నాయకుడు జగన్ వెనకే మేమంతా ఉంటాం.

– సురేష్, ఆటోడ్రైవర్, ప్రసాద్‌గార్డెన్స్

సీఎం బహిరంగ సభకు సన్నద్ధం కండి

- వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి
- నియోజకవర్గ నేతలు, కార్యకర్తలకు ఎమ్మెల్యే వాసుపల్లి పిలుపు



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : భీమిలిలో 27న నిర్వహించనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరూ హాజరయ్యేలా అందర్నీ కలుపుకుని రావాలన్నారు. ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పార్టీ విజయానికి పని చేసి నియోజకవర్గం సత్తా చాటాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. బాధ్యత లేని వాళ్లు ముందే తప్పుకోవాలని, పార్టీని భుజాన మోసే నేతలు చాలా మంది ఉన్నారన్నారు. ప్రతి కార్యకర్త 100 మంది ఓటర్లను తయారు చేసే విధంగా కసిగా పని చేయాలన్నారు. పార్టీని వీడే నేతలు తమ నాయకుడు జగనన్న కోసం, వైఎస్సార్ సీపీ కోసం తప్పుగా మాట్లాడితే ఇకపై సహించేది లేదని హెచ్చరించారు. నమ్మకంతో పని చేస్తే జగనన్న ప్రతి ఒక్కరిని ఏ భేదం చూడకుండా అవకాశం కల్పిస్తారనడానికి తానే ఒక ఉదాహరణగా చెప్పుకొచ్చారు. మంచి నాయకత్వ లక్షణాలున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుని విజయం అందించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ, పలువురు కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఆలయాల చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

'రెల్లి కులానికి ఎమ్మెల్సీ కేటాయించాలి'



జీవీఎంసీ గాంధీ పార్కులో ఒక రోజు దీక్ష చేస్తున్న చెన్నా తిరుమలరావు

సీతమ్మధార : రెల్లి కులానికి ఒక ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని ఏపీ రెల్లి కుల సంక్షేమ సంఘం, రెల్లిహక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆడమ్స్ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ పార్కులో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఒక రోజు నిరాహార దీక్ష ప్రారంభించారు. ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ ప్రధాని కలలు గన్న స్వచ్ఛ భారత్ అమలుకు అవిశ్రాంతంగా పని చేసే రెల్లి కులస్తులకు రాజ్యాంగంలో పొందుపరిచిన ఫలాలు అందకపోవడాన్ని ఆక్షేపించారు. దేశ జనాభాలో ఇరవై లక్షలకు పైగా ఉన్న తమ కులం అన్ని రాష్ట్రాల్లోనూ తరతరాలుగా పారిశుధ్య పనికే పరిమితమవుతుందని గుర్తు చేశారు. తమ వారు చట్ట సభల్లో ఎలాంటి ప్రాతినిధ్యానికి నోచుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సఫాయి కర్మచారీ ఉపాధ్యక్షుడు నిమ్మకాయల శ్రీనివాసరావు, గౌతమ్ బాబా సేవా సంఘం అధ్యక్షుడు సింగంపల్లి కళ్యాణ్ ముని, రెల్లి నాయకులు బంగారి వెంకటేశ్వరరావు, కస్తూరి వెంకటరావు, మీసాల ప్రదీప్, నరసింహమూర్తి, సీహెచ్ వెంకటరావుపాల్ తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి

11 మందికి ఆర్థిక సాయం అందజేత



వెంకట్రావు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



35వ వార్డులో మంచాన పడ్డ వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

డాబాగార్డెన్స్ : సాయం కావాలంటే మీ ముందుంటాను. ఎప్పుడు.. ఏ ఆపద వచ్చినా మీకు నేనున్నాను. ప్రజా సమస్యలు ఒక ఎత్తు. వైద్యపరంగా ఆదుకునేందుకు ఎల్లప్పుడూ సిద్ధమని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నియోజకవర్గ ప్రజలకు భరోసా ఇచ్చారు. ప్రజాదర్బార్‌లో వైద్య సాయం కోసం వచ్చే అర్జీలతో పాటు వార్డు నాయకుల ద్వారా తెలుసుకుని ఆర్థిక సాయం చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో 11 మందికి రూ.55 వేల ఆర్థిక సాయం అందజేశారు. 33వ వార్డు వేంకటేశ్వరమెట్ట ప్రాంతానికి చెందిన గుడింటి కిషోర్‌కుమార్, అదే ప్రాంతం గ్రంథాలయం సమీపాన బొబ్బిలి నాగరాజుకు, 32వ వార్డు పకోడి సందులో బొడ్డు నూకాలమ్మ, 35వ వార్డు వెలంపేటకు చెందిన జెర్రిపోతుల నూకరాజు, అదే ప్రాంతానికి చెందిన కర్రి రమణకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. 30వ వార్డు జాలారిపేటకు చెందిన వాడమోదుల మూతిరాజు, 37వ వార్డు కొత్త అగ్రహారానికి చెందిన అర్జిల్ల సురేంద్ర, 39వ వార్డు కురుపాం మార్కెట్ ప్రాంతానికి చెందిన మేరీ జూనియానా డి క్రజ్, రుద్రవారి వీధికి చెందిన బొడ్డు సూర్యారావుకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. వీరంతా దీర్ఘకాలిక జబ్బులతో మంచం పట్టారు. ఆర్థిక సాయం అందివ్వడమే గాక మీకు నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ వారిలో ధైర్యాన్ని నింపారు. అలాగే 33వ వార్డులో ఇటీవల మృతి చెందిన పినగాడి వెంకట్రావు కుటుంబ సభ్యులకు పెద్ద కర్మ కోసం రూ.5వేలు అందజేసి పెద్ద మనసు చాటుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, ఆలయాల చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సులపై పోలీసుల కొరడా

రోడ్డుపై నిలిపిన ప్రైవేట్ బస్సుల తొలగింపు



రోడ్డుపై నిలిపిన ప్రైవేట్ బస్సులను ఖాళీ చేయిస్తున్న సీఐ తిరుమలరావు



వైఎస్సార్ పార్కు రోడ్డులో నిలిపివేసిన ప్రైవేట్ బస్సులు (ఫైల్)

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార : రోడ్డుకు అడ్డంగా నిలిపివేసిన ప్రైవేట్ బస్సులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. సాక్షి దినపత్రికలో ఈ నెల 19న 'రోడ్డుకు ఇరువైపుల ప్రైవేట్ బస్సులు' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు టూటౌన్ పోలీసులు స్పందించారు. శనివారం ద్వారకానగర్, జీవీఎంసీ గాంధీ విగ్రహం, సెంట్రల్ పార్కు ఎదురు రోడ్డులో ఇరువైపుల నిలిపి ఉంచిన ప్రైవేట్ బస్సులు, ఆటోలను ఖాళీ చేయించారు. శ్రీకాకుళం, విజయనగరం, ఇచ్ఛాపురం, కవిటి, పార్వతీపురంతో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన ప్రైవేట్ బస్సులు ఈ రోడ్డులో నిలిపేస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు వచ్చిన బస్సులు మూడు గంటల వరకు నిలిపేస్తుండటం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతుండటంతో చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ తిరుమలరావు మాట్లాడుతూ ఇలా బస్సులను రోడ్డుపై నిలిపేస్తుండటం వల్ల ప్రజలు, వాహన చోదకులకు ఇబ్బందిగా ఉండటంతో చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న కో–ఆప్షన్ మెంబర్ షరీఫ్, సర్వేశ్వరరెడ్డి

సీతమ్మధార : ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల మలి విడతలో భాగంగా మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు కో–ఆప్షన్ మెంబర్ ఎం.డి.షరీఫ్, 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఆటల పోటీల వలన ఆరోగ్యం, ఆనందంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. బ్యాడ్మింటన్ మహిళా విభాగంలో విజేతలుగా నిలిచిన వారికి అతిథులు బహుమతులు అందజేశారు. రాష్ట్ర నాగవంశ కార్పొరేషన్ డైరెక్టర్ కనకల ఈశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు వి.సంధ్య, కుమారి, వసుంధర పాల్గొన్నారు.

వైద్యులకు అయోధ్య రాముని అక్షింతలు అందజేత



కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్‌కు అక్షింతలు అందజేస్తున్న రవికుమార్

మహారాణిపేట : అయోధ్య శ్రీరాముని అక్షింతలను శనివారం బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ ఆర్.రవికుమార్ పలువురు వైద్యులకు అందజేశారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్మథరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. అశోక్‌కుమార్, ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, ఈఎన్‌టీ ఆస్పత్రి రిటైర్డు సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణకిషోర్, ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి తదితరులకు అక్షింతలు అందించారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా ప్రతినిధి గేదెల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

విశాఖ విద్య: జీవీఎంసీ పరిధిలోని విశాఖ, భీమిలి, అనకాపల్లి డివిజన్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతి పత్రం అందజేశారు. జీపీఎఫ్ నగదు ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాల్లోకి తక్షణమే జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2014 డీఎస్సీ ఉపాధ్యాయుల నియామక తేదీల్లో మార్పు చేయాలన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి, విశాఖ జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శులు గొంది చిన్నబ్బాయి, టి.ఆర్ అంబేడ్కర్, అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, విశాఖ జిల్లా కోశాధికారి రాంబాబు, నాయకులు ఎం.రాజునాయుడు, శోభ తదితరులు పాల్గొన్నారు. వినతి పత్రాన్ని పరిశీలించిన కమిషనర్ తగు చర్యలు తీసుకుని, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

'మార్పు మన(సు)తోనే మొదలు' పుస్తకావిష్కరణ



నవలలు ఆవిష్కరిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్ : వర్ధమాన రచయిత్రి డాక్టర్ చెల్లపిళ్ల సూర్యలక్ష్మి రచించిన 'మార్పు మన(సు)తోనే మొదలు' పుస్తకావిష్కరణ శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగింది. విశాఖ సాహితీ ఉపాధ్యక్షుడు డాక్టర్ దామెర సూర్యారావు తొలి పలుకుతో డాక్టర్ సూర్యలక్ష్మి రచించిన తొలి నవల 'అపజయాలు కలిగిన చోటే' పుస్తకావిష్కరణ కూడా నిర్వహించారు. రెండు నవలలు విశాఖ సాహితీ వేదికగా ఆవిష్కరించడం సంతోషకరమని ప్రముఖ కవి, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం పేర్కొన్నారు. రచయిత్రి తన గురువులను సభా ప్రారంభంలో సత్కరించడం అభినందనీయమని పేర్కొంటూ 'మననశీలమైనది మనసు' అంటూ రచయిత్రిని అభినందించారు. ఈ నవలలో మానసిక అంశాలు, శాస్త్రవేత్తలు, వైద్య నిపుణుల ప్రాముఖ్యతను తెలియజేశారన్నారు. డాక్టర్ దామెర వెంకట సూర్యారావు మాట్లాడుతూ పాఠకుడికి నవలలోని పాత్రలపై సానుభూతి కాకుండా గౌరవం కలిగేలా రచయిత్రి చిత్రీకరించిన తీరును ప్రశంసించారు. కార్యక్రమంలో రాంభట్ల నృసింహశర్మ, కస్తూరి మురళీకృష్ణ, డాక్టర్ మంగిపూడి వాణీసుబ్రహ్మణ్యం, విశాఖ సాహితీ కార్యదర్శి శంకర్ నీలు భాగవతుల, ఘండికోట విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సేద్యానికి సాంకేతిక సాయం

అధికారులకు జేసీ విశ్వనాథన్ ఆదేశం



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: ఆధునిక సాంకేతిక సహకారంతో రైతులకు మెరుగైన సేవలందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. తన చాంబర్‌లో శనివారం జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి, ధాన్యం కొనుగోలు సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా జేసీ.. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు. వ్యవసాయ, అనుబంధ రంగాల రైతులకు సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 10 ప్రొక్యూర్ సెంటర్లలో ఆరు వేల టన్నులకు గానూ 4,280 టన్నులు ప్రొక్యూర్ చేసినట్లు గుర్తు చేశారు. ఫిబ్రవరి రెండో వారంలోగా లక్ష్యాలను సాధించాలన్నారు. ఫిబ్రవరి 15లోగా రబీలో వేసిన పంటను మొత్తం ఈ క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. అర్హత కలిగిన వారికి పంట రుణాలు రెన్యువల్ చేయాలని ఆదేశించారు. పశు సంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ, అసిస్టెంట్ ఎల్.డి.ఎం.రమణబాబు, పౌర సరఫరాల కార్పొరేషన్ డీఎం రాజేశ్వరి, ఉద్యానవన శాఖ అధికారి మన్మథరావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్వార్టర్ ఫైనల్స్‌లో జీవీఎంసీ జట్టు విజయం

గాజువాక : జీవీఎంసీ, హెచ్‌పీసీఎల్ జట్ల మధ్య జింక్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన వీడీసీఏ ఇన్‌స్టిట్యూషన్స్ మొదటి క్వార్టర్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లో జీవీఎంసీ జట్టు ఐదు పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదటిగా బ్యాటింగ్‌ను ప్రారంభించిన జీవీఎంసీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టపోయి 131 పరుగులను చేసింది. జీవీఎంసీ తరఫున సునంద 43, నరేష్ కుమార్ 26 పరుగులు చేశారు. హెచ్‌పీసీఎల్ తరఫున మోహన్ కుమార్ 4, వివేక్‌సింగ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన హెచ్‌పీసీఎల్ జట్టు 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు నష్టపోయి 126 పరుగులు మాత్రమే చేయగలిగింది. జీవీఎంసీ తరఫున సుబ్రహ్మణ్యం 3, కెప్టెన్ శివ 2 వికెట్లను సాధించి తమ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన సునంద, సుబ్రహ్మణ్యంలను జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, టీమ్ మేనేజర్ సన్నీ అభినందించారు.

బాలరాముడి వర్ణ చిత్రాల పోటీకి ఆహ్వానం

మహారాణిపేట: అయోధ్యలో ప్రారంభానికి ముస్తాబైన రామాలయం గురించే దేశం మొత్తం మాట్లాడుకుంటున్న శుభ తరుణంలో ప్రత్యేకించి చిన్నారులను ఈ సంబరాలలో భాగస్వాములను చేయాలని వేద విజ్ఞాన సమితి నిర్ణయించింది. వారి కోసమే బాలరాముడి వర్ణచిత్రాల పోటీ నిర్వహించి, మొదటి ముగ్గురు విజేతలకు రూ. 1,116 బహుమతిగా అందించడంతో పాటు పాల్గొన్న వారందరికీ శ్రీరాముని ఆశీస్సులతో కూడిన ప్రశంసాపత్రాలనూ అందించనుంది. ప్రముఖ చిత్రకారులు నుదురుపాటి అప్పల నరసయ్య (సయ్య మాస్టర్) పోటీల వివరాలను వెల్లడించారు. 6 నుంచి 15 ఏళ్ల మధ్య గల పిల్లలు ఎవరైనా, ఏ ప్రాంతం నుంచైనా అయినా వారి ఇంట్లోనే ఉండి ఈ పోటీలో పాల్గొనవచ్చని అప్పలనరసయ్య తెలిపారు. బాలరాముడు ప్రధాన అంశంగా వేసిన ఒక వర్ణ చిత్రాన్ని, పేరు, ఊరు, చదువుతున్న తరగతి రాసి ఫొటో తీసి ఈనెల 21వ తేదీలోపు సెల్ నంబర్ 81256 74182కు వాట్సప్ ద్వారా పంపాలని ఆయన కోరారు. గీసిన చిత్రంతోపాటే, ప్రశంసా పత్రంపై ముద్రించేందుకు క్లోజ్–అప్ ఫొటోను కూడాపై పంపాలని కోరారు. పోటీ విజేతలను ఈ నెల 22న సాయంత్రం ఏడు గంటలకు ప్రకటిస్తారు. ప్రశంసా పత్రాలు వాట్సప్ ద్వారా పంపిస్తామని సయ్య మాస్టర్ పేర్కొన్నారు.